## క్లుప్తంగా

### నిరుద్యోగ యువతకు కీట్స్ ట్రస్ట్ ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: నందిగామలోని కీట్స్ ట్రస్టు ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు హెల్త్‌కేర్ కౌన్సిలర్, కో–ఆర్డినేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి హరిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెల్త్‌కేర్, కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తో పాటు వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై డిగ్రీ, పీజీ పాస్, ఫెయిల్ అయిన 19 నుంచి 30 ఏళ్లలోపు వయసు కలిగిన అభ్యర్థులకు 60 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో శిక్షణ కల్పించి, నూరు శాతం ఉద్యోగావకాశాలు చూపిస్తామని పేర్కొన్నారు. ఈనెల 9వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శిక్షణకు సంబంధించిన వివరాలకు 90004 87423 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

### సినీ హీరో కిరణ్ అబ్బవరానికి సన్మానం



పాత గుంటూరు: ఈవీవీ యువ కళావాహిని అధ్యక్షుడు వెచ్చా కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ప్రముఖ సినీ హీరో కిరణ్ అబ్బవరంను ఘనంగా సన్మానించారు. ఆదివారం ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన్ను విద్యానగర్‌లోని అతిథి గృహంలో సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కండె నాగరాజేష్, కొత్తూరి పవన్ రాజశేఖర్, టి. హరికృష్ణ, బిళ్లా మహేష్, గ్రంధి శ్రీరామ్ పాల్గొన్నారు.

### సినీ నటి పూర్ణిమకు సత్కారం



పాత గుంటూరు: రాజాగారి తోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకుని శ్రీ ఆలాపన కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు కొల్లా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 'దొరకునా ఇటువంటి సేవ' పేరుతో ఆదివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్. బి.జి.పార్థసారథి, జగ్గయ్యపేట న్యాయమూర్తి యం. శోభారాణి, డాక్టర్ వేమూరి నాగశంకర్, డాక్టర్ లయన్ బాబు మిరియం, కె.బి. శెబాస్టియన్ పాల్గొని జ్యోతి ప్రకాశనం చేశారు. అక్కినేని నటించిన చిత్రాల్లోని పాటల్ని గాయకులు రసూల్ బాబు, ఉపేంద్రసింగ్, కొల్లా వెంకటేశ్వరరావు, ఎం. హెలెన్‌కుమారి, శోభారాణి, సుధా శ్రీనివాస్, రాణి, కె. జయలక్ష్మి మధురంగా ఆలపించారు. అనంతరం సభలో సినీ నటి పూర్ణిమకు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

### బాలుడి అదృశ్యం

గుంటూరు ఈస్ట్: బాలుడి అదృశ్యంపై నగరపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గత నెల 29న కృష్ణబాబు కాలనీకి చెందిన 16 సంవత్సరాల దేవెళ్ల కార్తిక్ ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అతని ఆచూకీ కోసం వెతికి కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న తల్లిదండ్రులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### దేవాంగులకు సముచిత స్థానం కల్పించాలి



మంగళగిరి: రానున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీలు దేవాంగులకు జనాభా దామాషా ప్రకారం మూడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ సీట్లు కేటాయించాలని సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. దేవాంగులకు సముచిత స్థానం కల్పించిన రాజకీయ పార్టీలకే తాము మద్దతు ప్రకటిస్తామని తెలిపారు. చీరాల, పుట్టపర్తి, రాజమండ్రి రూరల్ సీట్లతో పాటు హిందూపురం పార్లమెంట్ సీటును కేటాయించాలని కోరుతూ ఆదివారం పట్టణంలో ఎన్ఆర్ఐ జంక్షన్ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం జాతీయ రహదారి పక్కనున్న కన్వెన్షన్ సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు డి.కె. నాగరాజు, బల్ల వెంకటరమణ, పుచ్చల రామకృష్ణ, సజ్జ హేమలత, బీరక ప్రసాద్, ఆకాశపు స్వామి, నక్కిన రాజశేఖర్, ఏరాసు అరుణబాబు పాల్గొన్నారు.

### జూదరుల అరెస్టు

మంగళగిరి: నగర పరిధిలోని చినకాకాని రాజ్ కమల్ రోడ్డులో పేకాడాడుతున్న ఆరుగురిని ఆదివారం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 5120 స్వాధీనం చేసుకున్నారు.

# టీడీపీకి చరమగీతం పాడుదాం

- ప్రజల ప్రభుత్వాన్ని గెలిపించాలి
- వచ్చే ఎన్నికల్లో బాబు కపట నాటకాలు
- గుంటూరును మరింతగా అభివృద్ధి చేసుకుందాం
- నగరాన్ని టీడీపీ ప్రభుత్వం ఎలా ధ్వంసం చేసిందో చూశాం
- మరోసారి ఆ తప్పు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రజలదే..
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- 30వ డివిజన్‌లో వైభవంగా 'మనతో మన రజినమ్మ' కార్యక్రమం



స్థానిక మహిళలతో మాట్లాడుతున్న మంత్రి రజిని

పట్నంబజారు: ప్రజల జీవితాలతో చెలగాటమాడిన టీడీపీకి చరమగీతం పాడాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. నియోజకవర్గంలోని 30వ డివిజన్‌లో ఆదివారం 'మనతో మన రజినమ్మ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విడదల రజిని మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ప్రజలందరి ప్రభుత్వమని తెలిపారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తానున్నానే భరోసాని కల్పిస్తున్న గొప్ప ముఖ్యమంత్రి ఆయన అని కొనియాడారు. ప్రజల ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో ఎన్నో కపట నాటకాలను మనమంతా చూస్తామని, వాటిని ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. టీడీపీ పన్నాగాలను తరమికొట్టాల్సిన బాధ్యత ప్రజలదేనని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో పశ్చిమ నుంచి పోటీ చేసేందుకు సీఎం వైఎస్. జగన్ తనను ఇక్కడకు పంపారన్నారు. బీసీ మహిళనైన తనని ఇక్కడి ప్రజలంతా గెలిపిస్తారనే నమ్మకం ఉందని తెలిపారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరి ఇంటి బిడ్డగా తోడు ఉంటానని, గుంటూరు నగరాన్ని మరింతగా అభివృద్ధి చేసుకుందామని తెలిపారు. టీడీపీ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చిన ప్రతిసారి గుంటూరులో విధ్వంసం సృష్టించారని, మరోసారి ఆ తప్పు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందిరిపై ఉందని చెప్పారు. శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి పాలన సాగుతున్నట్లు తెలిపారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ ప్రజలంతా కలిసికట్టుగా ఉండి సీఎం జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, అధ్యక్షులు, అనుబంధ విభాగాల నేతలు, క్లస్టర్, మండల ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

**నగరాభివృద్ధే లక్ష్యం**

గుంటూరు నగరాభివృద్ధే తన లక్ష్యమని మంత్రి విడదల రజిని స్పష్టం చేశారు. గుజ్జనగుండ్ల వాకింగ్ ట్రాక్‌ను ఆదివారం ఉదయం సందర్శించి, అసోసియేషన్ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా వాకింగ్ ట్రాక్‌లోని అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడే ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు, వాకర్స్‌తో కలిసి వాకింగ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మంత్రి రజిని మాట్లాడుతూ అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలకు తాను పూర్తిగా వ్యతిరేకమని తెలిపారు. ఒక బీసీ మహిళగా తాను రాజకీయాల్లోకి వచ్చానని, చిలకలూరిపేట నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేసి చూపించామని చెప్పారు. ఆదర్శవంతమైన గుంటూరు నగరాన్ని తయారు చేయడమే లక్ష్యమని తెలిపారు. ఇంటి ఆడపడుచుగా తాను కోరుకునేది రాజకీయంగా ఆశీర్వదించమనేనని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు మార్కెట్ బాబు, బూసిరెడ్డి మల్లీశ్వరరెడ్డి, అంజిరెడ్డి, గుజ్జనగుండ్ల వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, ఆయా డివిజన్ల అధ్యక్షులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రీస్తు అందరికీ ప్రభువు



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి రజిని

పట్నంబజారు: క్రీస్తు అందరికీ ప్రభువని, ఆయన చూపిన శాంతి, ప్రేమ ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. నల్లపాడు రోడ్డులోని కృపా మినిస్ట్రీస్ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ ఏసుక్రీస్తు బోధనలన్నీ మన సమస్యలన్నింటికీ పరిష్కారాలను చూపుతాయని చెప్పారు. పరిశుద్ధ గ్రంథాన్ని ధ్యానించగలిగితే లెక్కకు మించిన సంగతులు అందరికీ బోధపడుతాయని తెలిపారు. నీతి కోసం హింసను అనుభవించగలిగిన వారిదే దేవుని రాజ్యం అని బైబిల్‌లో ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కృపా మినిస్టరీస్ చర్చి ఫాదర్ మాథ్యూస్ పాల్గొన్నారు.

### నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయాల్లోనూ ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన ఉంటుందన్నారు. అక్కడ పరిష్కారం కాని సమస్యలపై తమకు నేరుగా అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు.

### పేద విద్యార్థులకు ఎండోమెంట్ అవార్డుల ప్రదానం



విద్యార్థులతో రాఘవరావు, మస్తానయ్య, శ్రీనివాసరావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: పచ్చిపులుసు రామకుమారి ఎనిమిదో వర్ధంతి సందర్భంగా ఆదివారం బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం అన్నమయ్య కళా వేదికపై పచ్చిపులుసు రాఘవరావు, రామకుమారి ఎండోమెంట్ స్కాలర్‌షిప్పులను గుంటూరు చలమయ్య – కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అందజేశారు. అనంతరం వేదవతి భాగవతారణి ఆలపించిన భక్త మార్కండేయ హరికథ భక్తులను రంజింప చేసింది. కార్యక్రమంలో దేవస్థాన పాలకమండలి అధ్యక్షులు చిటిపోతు మస్తానయ్య, పచ్చిపులుసు రాఘవరావు, పచ్చిపులుసు ప్రభావతి విజయ శంకర్, వాణీ సతీష్, డాక్టర్ లక్ష్మీ సునీత ఆదినారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, సునీత, ఊటుకూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివి



కిశోర్‌కుమార్ దంపతులను సత్కరిస్తున్న హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: విధి నిర్వహణలో అంకిత భావం, చిత్తశుద్ధితో పనిచేసే ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. పెదకూరపాడు మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలనాధికారిగా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన కనుమూరి కిశోర్‌కుమార్‌కు ఆత్మీయ సన్మానాన్ని ఆదివారం జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రజలకు సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులు ఎన్నటికీ గుర్తుండిపోతారని తెలిపారు. అనంతరం కిశోర్ కుమార్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ఎస్ఎస్వీబీ వసంత రాయుడు, ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, పెదకూరపాడు తహసీల్దార్ భవానీశంకర్ పాల్గొన్నారు.

### వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానం ఉన్నతం



నెహ్రూనగర్: శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞానం ఎంతో ఉన్నతమైనదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ పేర్కొన్నారు. శ్రీ ఈశ్వరీదేవి పీఠం రాష్ట్రవ్యాప్త ధార్మిక పర్యటనలో భాగంగా కందిమల్లాయపాలెం నుంచి గుంటూరుకు వచ్చింది. ఈ సందర్భంగా అరండల్‌పేటలోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు పావులూరి హనుమంతురావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల ప్రత్యేక కళా నైపుణ్యత వెలకట్టలేనిదని కొనియాడారు. దేవాలయాల్లో పూజించే భగవంతుని రూపాన్ని భక్తులకు సుందరమైన రీతిలో అందించే భాగ్యం విశ్వబ్రాహ్మణుకే దక్కుతుందని తెలిపారు.

### జీజీహెచ్‌లో అత్యాధునిక క్యాన్సర్ వైద్యసేవలు



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో కోట్లాది రూపాయల ఖర్చుతో కార్పొరేట్ వైద్యసేవల్ని రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ఆదివారం జీజీహెచ్ క్యాన్సర్ సెంటర్‌లో డాక్టర్ కిరణ్‌కుమార్ రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీజీహెచ్ క్యాన్సర్ విభాగంలో రోగులకు అవసరమైన అత్యాధునిక లీనియర్ యాక్సిలేటర్, బ్రాకీథెరపీ, సీటీ సిమ్యూలేటర్, మామోగ్రామ్, ఎంఆర్ఐ, సీటీ స్కాన్ వైద్య పరికరాలతో పాటు ఎంతో అనుభవం ఉన్న క్యాన్సర్ వైద్యులు ఉన్నారని చెప్పారు. గతంలో చెన్నై, బెంగళూర్, హైదరాబాద్‌లకు రోగులు వెళ్లే వారని ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. గుంటూరు జీజీహెచ్‌లోనే అన్ని వైద్యసేవలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ ఝాన్సీ, అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ కోనేటి నందన తేజ, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైద్య వృత్తి మహోన్నతం



వైద్యుల సమక్షంలో భాష్యం రామకృష్ణను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: వైద్య వృత్తి మహోన్నతమైనదని, ప్రజలకు సేవ చేయడమే ధ్యేయంగా వైద్యులు భావిస్తారని జీజీహెచ్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎస్.శ్రీకాంత్ తెలిపారు. చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో ఆదివారం భాష్యం మెడెక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఉత్తమమైన వైద్యులకు ఉండాల్సిన ముఖ్య లక్షణాలుగా లోకజ్ఞానం, భావవ్యక్తీకరణ నైపుణ్యంతో పాటు, రోగులపై కరుణ కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. కష్టపడి చదివి సమాజంలో ఉత్తమమైన వైద్యులుగా సేవలందించాలని తెలిపారు. జీజీహెచ్ న్యూరాలజీ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గొట్టిపాటి బిందు నర్మద మాట్లాడుతూ ధనార్జనే ధ్యేయంగా ఎన్నో వృత్తులు ఉన్నాయని తెలిపారు. వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైనదని గుర్తించాలని విద్యార్థులకు సూచించారు. చదువు సాగిస్తున్న తరుణంలో ఎన్నో సవాళ్లు ఎదురవుతాయని, వాటిని ఏ దృష్టి కోణంలో చూస్తూ పరిష్కరించుకుంటామనేది మన విచక్షణపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశల్ని నిజం చేసి సమాజంలో మంచి వైద్యులుగా రాణించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ వైద్యులుగా అవకాశం వస్తే దాన్నిసద్వినియోగం చేసుకుని ప్రజలకు సేవ చేయాలని సూచించారు. భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్తులో ఉత్తమమైన వైద్యులుగా రాణించడానికి భాష్యం మెడెక్స్ ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. విద్యార్థులంతా దీన్ని సద్వినియోగం చేసుకుని లక్ష్యాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల ముఖ్య సలహాదారు మైఖేల్ రాజ్, భాష్యం మెడెక్స్ ప్రిన్సిపాల్ హరిబాబు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత పూర్వ విద్యార్థులు భాష్యం మెడెక్స్‌తో తమకున్న అనుబంధాన్ని, జ్ఞాపకాల్ని జూనియర్లతో పంచుకున్నారు.

## యువ వ్యాపార వ్యవస్థాపక సదస్సుకు స్పందన



సదస్సుకు హాజరైన పూర్వ విద్యార్థులు, కేఎల్‌యూ ప్రతినిధులు

తాడేపల్లి రూరల్ : వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఆదివారం యువ వ్యాపార వ్యవస్థాపకుల సదస్సును ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథివర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసించిన విద్యార్థులు సొంతంగా వ్యాపారాలను స్థాపించి అనేక మందికి ఉపాధి కల్పించడం ఆనందంగా ఉందని తెలిపారు. సదస్సుకు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలతో పాటు హైదరాబాద్, చెన్నై, బెంగళూరులలో వ్యాపారాలు స్థాపించిన వారు పెద్దసంఖ్యలో రావడం అభినందనీయమని పేర్కొన్నారు. అమరావతి బోటింగ్ క్లబ్ వ్యవస్థాపకులు, కేఎల్‌యూ పూర్వ విద్యార్థి తరుణ్ మాట్లాడుతూ ఎన్నో కొత్త ఆలోచనలకు, కొత్త సాకర్యాలకు నాంది కేఎల్‌యూ అని తెలిపారు. నూతన వ్యాపారాలను స్థాపించాలకునే వారికి సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రో వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, పూర్వ విద్యార్థుల విభాగం డైరెక్టర్ డాక్టర్ సీహెచ్. శ్రీకావ్య, అసిస్టెంట్ డైరెక్టర్ సోని, సీనియర్ మేనేజర్ కృష్ణారావు, బీబీఏ, ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు అభినందనలు



తాడేపల్లి రూరల్ : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో మంగళగిరి నియోజకవర్గం నుంచి జిల్లాస్థాయికి ఎంపికై, వివిధ కేటగిరీల్లో గెలుపొందిన క్రీడాకారులను వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారని తెలిపారు. క్రీడాకారులంతా రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీలు రమేష్, సాంబశివరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

## 11న గాయకులకు స్వరరత్న పురస్కారాలు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న రంగారావు, గాయకులు

పాత గుంటూరు: అమర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 11న ఇన్నర్ రింగు రోడ్డులోని శిల్పారామం వేదికగా విశిష్ట గాయకులకు స్వరరత్న పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు కళాదర్బార్ వ్యవస్థాపకులు పొత్తూరి రంగారావు తెలిపారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఘంటసాల గానామృతం పేరుతో సంగీత విభావరి ఉంటుందని తెలిపారు. అనంతరం జరిగే సభలో అతిథులుగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఘంటసాల కృష్ణకుమారి పాల్గొని 14 మంది గాయకులకు పురస్కారాలు అందించి సత్కరించనున్నట్లు తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు నాజ్‌సెంటర్‌లోని ఘంటసాల విగ్రహం వద్ద వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంగీతాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో కళా సంస్థల ప్రతినిధులు మిరియాల ప్రసాదరావు, మేకల పురుషోత్తమ ప్రసాద్, గాయకులు జరీనా, బాబూరావు, సుధీర్ బాబు, రజని, సభ్యులు రాజశేఖర్ పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో త్యాగరాజస్వామి నగరోత్సవం



నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు

పాత గుంటూరు: లక్ష్మీపురం త్యాగరాజస్వామి కళా వేదికగా గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో ఆదివారం సంగీత గురువు త్యాగబ్రహ్మ 177వ ఆరాధన సంగీత మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. విశ్రాంత ప్రిన్సిపాల్ బి. జయామూర్తి జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రముఖ హరి కథకులు శంభయాచారి త్యాగరాజస్వామి వేషధారణలో ఆయన కీర్తనల ఆలాపనతో నగరోత్సవం నిర్వహించారు.అనంతరం పంచరత్న కీర్తనల గానం జరిగింది. శాస్త్రీయ సంగీత కచేరిలో చెన్నైకు చెందిన సాయి విఘ్నేష్ పలు త్యాగరాజ స్వామి కృతుల్ని శ్రావ్యంగా గానంచేసి సంగీతాభిమానుల్ని అలరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఎం.డి.వి. రమణారావు మాట్లాడుతూ అయోధ్యలో రాముడి ప్రతిష్ట జరిగిన ఈ సంవత్సరం త్యాగరాజ ఉత్సవాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయని తెలిపారు. డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి, రామరాజు ఫౌండేషన్ చైర్మన్ రామరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలతో నగరోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. కళాకారుల్ని అభినందించారు. కార్యక్రమాన్ని కార్యదర్శి ఏ.వి.మంగాదేవి, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, మాధవపెద్ది మీనాక్షి, పాటిబండ్ల లలితాదేవి, ఉప కార్యదర్శి ఎం. మాధవీకృష్ణ, కోశాధికారి ఎం.విజయలక్ష్మి పర్యవేక్షించారు. ప్రధాన కార్యదర్శి ఎం.వై. శేషురాణి నిర్వహించారు.

## బంద్, సమ్మెను జయప్రదం చేయండి



తాడేపల్లి రూరల్ : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 16న నిర్వహించనున్న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేటీ భవన్‌లో రైతు, కౌలు రైతు, కార్మిక సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. శివశంకరరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. సీ టు ప్లస్ 50 శాతం మద్దతు ధరలను పార్లమెంటులో ఆమోదించేందుకు చట్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 లేబర్ కోడ్‌లను రద్దు చేసి, నాలుగుగా మార్చడం దుర్మార్గమని ఖండించారు. కార్యక్రమంలో రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, సీఐటీయూ నాయకులు వడ్డేశ్వరం పున్నయ్య, మహిళా సంఘం తాడేపల్లి మండల అధ్యక్షురాలు కారసాల స్వాతి పాల్గొన్నారు.

## సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం



తాడేపల్లి రూరల్ : ముస్లింలకు రాజకీయంగా, సామాజికంగా అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. సీఎం జగన్‌తోనే సామాజిన న్యాయం సాధ్యమని తెలిపారు. దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు గుంటూరు ఈస్ట్, విజయవాడ పశ్చిమం, నెల్లూరు సిటీ, కర్నూలు, కదిరి, కడప, మదనపల్లి కలిపి మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాలు కేటాయించారని తెలిపారు. ఇది సామాజిక న్యాయానికి నిదర్శనమని పేర్కొన్నారు. మైనార్టీల అభ్యున్నతి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్ సాహెబ్, షేక్ జాన్ సైదా పాల్గొన్నారు.